RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే
దిన పత్రిక

మంచిమాట

ఏ బంధం అయినా ఉంటే అద్దంలా ఉండాలి లేదంటే నీడలా ఉండాలి. ఎందుకంటే... అద్దం ఎప్పుడూ అబద్ధం చెప్పదు, నీడ ఎన్నడూ మనల్ని వదిలివెళ్లదు.

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్   సంపుటి : 04   సంచిక : 250

# అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్..

హైదరాబాద్, ఆగస్టు 24: సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనప్రాయంగా తెలిపారు. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని తిరిగి వచ్చిన ఆయన ఇవాళ అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశ మయ్యారు. అలాగే తాజా రాజకీయ పరిస్థితులపైనా వారితో చర్చించారు. కొండా సురేఖ అంశంపై ఇక ఎవరూ మాట్లాడొద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇక అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగాలనే దానిపై ఇంకా తుది నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఈ అంశాన్ని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో ఖరారు చేయనున్నారు.ఇక తెలంగాణలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్ లో నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. గత బీఆర్ ఎస్ 10 ఏళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అలాగే మాజీ సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలన్నారు. ఇక ఈ సమావేశాల్లో ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలను చర్చించే అవకాశం ఉంది.ఇక రాష్ట్రంలో ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలు, రగులుతున్న సామాజిక అంశాల నేపథ్యంలో సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు రాష్ట్ర రాజకీయాల్లోనే అత్యంత కీలకంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులందరూ నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవా లన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తి కావని, భూ సేకరణ, ఆర్ అండ్ ఆర్, అటవీ అనుమతులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.



## కొండా సురేఖ అంశం క్రమశిక్షణ
# కమిటీ పరిశీలిస్తుంది
### : సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 24: మంత్రి కొండా సురేఖ అంశం క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ నిర్ణయాన్ని అందరూ అంగీకరించాల్సిందేనని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండా సురేఖ అంశంపై స్పందించారు. అధిష్ఠానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొన్నారు.అంతర్గత వ్యవహారాలపై మాట్లాడనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే ఊహాజనిత కథనాలపై స్పందించనని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఈ సమావేశంలో తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై ఆయన ఘాటుగా స్పందించారు. దురుద్దేశపూర్వకంగానే తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని తెలిపారు.మరో వైపు మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా గీసుకొండలో ఆమె అభిమానులు వేడుకలు నిర్వహించారు. దీనికి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.దీనిపై క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది.

దాంతో ఆ కమిటీకి కొండా సురేఖ వరుసగా రెండు లేఖలు రాశారు.

## 22 పై కొత్త కథలు అల్లి ప్రజలను
# భయపెడుతున్న ప్రతిపక్షాలు
### : మంత్రి పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 24: హైదరాబాద్‌లో 22ఏపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయంటూ ప్రతిపక్షాలపై తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. 22పై కొత్త కథలు అల్లి ప్రజలను భయపెడుతున్నాయని ఆయా పార్టీలపై మండిపడ్డారు. గతంలో రిలాక్స్ ఇచ్చిన వాటికి క్లియరెన్స్ ఇచ్చామని తెలిపారు. నిజమైన (జెన్యూన్‌గా) వాటిలో 98 శాతం రిజిస్ట్రేషన్ చేశామన్నారు. చేయలేనివి చేయలేమని తేల్చి చెప్పామని వివరించారు.అయితే టోల్ ఫ్రీ నంబర్ పని చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను మంత్రి పొంగులేటి ఖండించారు. అందులో వాస్తవం లేదని చెప్పారు. ఇప్పటి వరకు ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు 1,162 కాల్స్ వచ్చాయని పేర్కొన్నారు. అందులో రిపీటెడ్ కాల్స్ తొలగిస్తే.. 980 వచ్చాయన్నారు. వాటిలో 547 వ్యవసాయానికి అనుబంధమైనవి, 433 వ్యవసాయేతర కాల్స్ అని వివరించారు. రిజిస్ట్రేషన్ కాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## నా పర్యటనను అడ్డుకోవడం
# తెలంగాణ ప్రజలను అవమానించడమే
### : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 24: వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(సోమవారం) మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు.టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు.విదేశాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం..'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చింది. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను అనుమతిచ్చారు.



## మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై నివేదిక
# సిద్ధం చేసిన క్రమశిక్షణ కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 24 : తెలంగాణ మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నివేదిక సిద్ధం చేసింది. ఈ నివేదికను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఈ కమిటీ ఇవ్వనుంది. ఈ క్రమంలోనే కొండా సురేఖపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం.కొండా సురేఖతో పాటు మరో ఇద్దరి వ్యవహారంపై కఠిన నిర్ణయం తీసుకునేలా క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. ఈరోజు (సోమవారం) సాయ ంత్రం ఈ నివేదికను ఏఐసీసీకి మహేశ్ గౌడ్ పంపనున్నారు. ఆమె వివరణకు క్రమశిక్షణ కమిటీ సంతృప్తి వ్యక్తం చేయలేదని సమాచారం.కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ సిఫారసు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె కూతురు సుస్మిత ఆరోపణలు చేస్తే సహజ న్యాయ సూత్రం ప్రకారం సురేఖ ఖండించాల్సి ఉందని.. కానీ అలా చేయలేదని ఈ కమిటీ అభిప్రా యపడింది. సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం, పార్టీపై ఎవరు తప్పుడు మాటలు మాట్లాడినా తప్పనిసరిగా చర్యలు ఉండాల్సిందేనని ఈ కమిటీ స్పష్టం చేసింది. గతంలో కొండా సురేఖను కాపాడానని, ఇక తానేమీ చేయలేనని మహేశ్ గౌడ్ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

సీఎం రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాష్ట్రంలోని తాజా పరిణామాలపై ఇరువురు నేతలు ఈ సమావేశంలో చర్చిస్తున్నారు. ఇటీవల భట్టితో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి భేటీ అయ్యారు. కొండా సురేఖ అంశంపై సీఎం రేవంత్, భట్టి విక్రమార్క చర్చించనున్నట్లు సమాచారం.




# జాబ్ నోటిఫికేషన్లు నిల్..
## లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్
### : హరీశ్ రావు



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు.

## సెప్టెంబర్ 3న కోర్టు కీలక తీర్పు!
# డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ రద్దు?




అమెరికా: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వేలాది మంది భారతీయ విద్యార్థులతో పాటు ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన అంతర్జాతీయ విద్యార్థులకు సెప్టెంబర్ 3, 2026 అత్యంత కీలకమైన రోజుగా మారింది. అమెరికా అంతర్గత భద్రతా విభాగం తీసుకొచ్చిన కొత్త వీసా నిబంధనలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై ఫెడరల్ కోర్టు ఈ రోజున కీలక విచారణ జరపనుంది.దశాబ్దాలుగా అమలులో ఉన్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' విధానాన్ని రద్దు చేస్తూ, విద్యార్థుల వీసాలపై నిర్దిష్ట ముగింపు తేదీలను (ఫిక్స్డ్ గడువు) విధించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త నిబంధన అమలైతే విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుందని యూనివర్సిటీలు, విద్యార్థి సంఘాలు కోర్టును ఆశ్రయించాయి.గత నాలుగు దశాబ్దాలుగా అమెరికాకు వెళ్లే ఎఫ్-1 (ఫ్-1), జే-1 (జీ-1) వీసాదారులు తమ చదువు లేదా రీసెర్చ్ పూర్తయ్యే వరకు ఎలాంటి కాలపరిమితితో సంబంధం లేకుండా దేశంలో ఉండేందుకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్' నిబంధన ఉపయోగపడేది. కానీ, జూలై 17న డెహెచ్ఎస్ ప్రకటించిన కొత్త రూల్ ప్రకారం ఇకపై విద్యార్థులకు కచ్చితమైన గడువు మాత్రమే ఇస్తారు.చదువు పూర్తి కావడానికి అదనపు సమయం కావాలంటే 'యుఎస్‌సీఐఎస్' మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి.

## డేటా ఆధారిత పాలనను మరింత
# బలోపేతం చేయాలి
### : సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 24: డేటా ఆధారిత పాలనను మరింత బలోపేతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన రియల్ టైమ్ గవర్నెన్స్ పై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. అలాగే సచివాలయంలో పై మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అమలుపై సమీక్షించారు.అలాగే 'మన మిత్ర' సేవలపై చర్చించారు. ప్లాట్‌ఫామ్ పని తీరును కూడా సీఎం చంద్రబాబు సమీక్షించారు.ద్వారా ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. ఆస్పత్రుల డేటా విశ్లేషణపై ఆ శాఖ అధికారులతో చర్చించారు. సేవల పనితీరుపై సమీక్షించారు. ప్రక్రియ పురోగతిపై సీఎం ఆరా తీశారు.ఈ సందర్భంగా రిజిస్ట్రే షన్లు, రీ-సర్వే అంశాలపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. పురోగతిని కూడా సమీక్షించారు. రేషన్ పంపిణీ డేటా విశ్లేషణపై అధికారులతో చర్చించారు. ఈ సమీక్షకు రెవెన్యూ, విద్య, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారుల హాజరయ్యారు.



# లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో చిట్టోజిపల్లి గ్రామంలో మెగా హెల్త్ క్యాంపు

**-- సుమారు 200 మందికి వైద్య పరీక్షలు**

**-- ఉచిత మందుల పంపిణీ**



**చేగుంట ఆగస్టు 24 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలంచిట్టోచిపల్లి గ్రామపంచాయతీ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో, మల్లారెడ్డి హాస్పిటల్,సూరారం సౌజన్యంతో మెగా ఉచిత హెల్త్ క్యాంపునిర్వహించారు.మల్లారెడ్డి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ తుషార్, సందీప్ మార్కెటింగ్ మేనేజర్ పవన్ తదితరుల సహకారంతో లయన్స్ క్లబ్ చేగుంట అధ్యక్షులు రాజనకు రామచంద్రం, డిస్ట్రిక్ట్ హెల్త్ క్యాంప్స్ చైర్మన్ స్వర్గం సిద్దిరాములు పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 200 మంది గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు, నిర్వహించి, అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు. వైద్యులు ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, ముందస్తు వైద్య పరీక్షల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట అధ్యక్షులు రాజనకు రాంచంద్రం, హెల్త్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ స్వర్గం సిద్ధిరాములు, ఎన్విరాన్మెంట్ డిస్టిక్ చైర్పర్సన్ ఒంటరి రామిరెడ్డి, సభ్యులు మామిడాల యాదగిరి, పులబోయిన రవికుమార్, గుండ్ల సంపత్, చిట్టోజిపల్లి గ్రామ సర్పంచ్ మద్ది లక్ష్మీ నరసయ్య, ఉప సర్పంచ్ మడిగల రాజు, చిన్న బాలు వెంకటేష్, సెక్రటరీ రాజు, తదితరులు పాల్గొన్నారు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని వైద్యసేవలనువి నియోగించుకున్నారు"లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో మల్లారెడ్డి హాస్పిటల్‌తో గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మా వంతు సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం అని లైన్స్ క్లబ్ అధ్యక్షులు రాజనకు రామచంద్రం తెలిపారు.


# చిట్టోజిపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం



**చేగుంట, ఆగస్టు 24 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం చిటోజి పల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా చిట్టోజిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో 50 మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి సంరక్షించాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.ఎన్విరాన్మెంట్ డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ లయన్ ఒంటరి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రాజనకు రామచంద్రం, హెల్త్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ లయన్ స్వర్గం సిద్ధరాములు, సభ్యులు మామిడాల యాదగిరి, పులబోయిన రవికుమార్, గుండ్ల సంపత్, సర్పంచ్ మద్ది లక్ష్మీనరసయ్య, ఉప సర్పంచ్ మడిగల రాజు, కార్యదర్శి రమేష్, చిన్న బాలు వెంకటేష్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# చేగుంటలో ప్రజావాణి కార్యక్రమం - 7 ఫిర్యాదుల స్వీకరణ



**చేగుంట, ఆగస్టు 24 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 7 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 5,పంచాయతీరాజ్ శాఖకు 1, పోలీస్ శాఖకు 1 దరఖాస్తు వచ్చాయి. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు ప్రజావాణి సైట్ ద్వారా పంపించినట్లు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలని అధికారులు కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ టి.చిన్నారెడ్డి, తహసిల్దార్ బి.బాలలక్ష్మి, వ్యవసాయ అధికారి ఎం.హరిప్రసాద్, విద్యాశాఖ అధికారి టి.నీరజ, పంచాయతీ అధికారి ఏ.ప్రకాష్, హౌసింగ్ ఏఈ ఎండి రియాజుద్దీన్, మిషన్ భగీరథ ఏఈఈ ఎం.దివ్యశ్రీ, విద్యుత్ ఏఈ వంశీకృష్ణ, ఇరిగేషన్ ఏఈఈ సిద్ధార్థ కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్యామల, ఏపీఎం ఆర్.దుర్గాప్రసాద్, ఏపీఎం టి.శ్వేత, ఏఈ పీఆర్ అభినవ్ నాయక్, అటవీ శాఖ అధికారి జె.శ్రీవల్లి, వైద్య శాఖ అధికారి ఎం.సంపతి, వెటర్నరీ అధికారి బి.కావ్య, సోషల్ వెల్ఫేర్ అధికారులు కె.రమేష్, ఎ.స్వాతి, బీసీ వెల్ఫేర్ అధికారి ఏ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.12 లక్షల విరాళం



**జిన్నారం, ఆగస్టు 24:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

ప్రజాసేవతో పాటు ఆధ్యాత్మిక సేవలోనూ తనదైన ముద్ర వేస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణ పనులకు ఆయన తన సొంత నిధుల నుంచి రూ.12 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. సోమవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, ఆలయ కమిటీ సభ్యులకు నగదును అందజేసి ఈనెల 30న జరిగే ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు ప్రజలను ఏకం చేసే సామాజిక వేదికలని, నియోజకవర్గంలో ఇప్పటివరకు సొంత నిధులతో 200లకు పైగా ప్రార్ధనా మందిరాలను నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు జనార్ధన్, కుమార్ గౌడ్, మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, నాయకులు వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మధుమేహ సంబంధిత కంటి వ్యాధుల గుర్తింపుపై ఏఐ పరిశోధనకు పీహెచ్.డీ.



**పటాన్ చెరు, ఆగస్టు 24:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ లోని, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థిని జి.కార్తీక డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'డయాబెటిక్ రెటినోపతి, మధుమేహ సంబంధిత కంటి వ్యాధుల స్వయంచాలక గుర్తింపు, వర్గీకరణ కోసం డీప్ లెర్నింగ్, ట్రాన్స్ ఫార్మర్-ఆధారిత ఫ్రేమ్ వర్కుల'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. విజయకుమార్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సిద్ధాంత వ్యాసం, ఫండస్ చిత్రాల నుంచి రెటీనా వ్యాధులను కచ్చితంగా, సమర్థవంతంగా నిర్ధారించడానికి, డీప్ లెర్నింగ్, విజన్ ట్రాన్స్ ఫార్మర్స్, జెనరేటివ్ అడ్వర్సేరియల్ నెట్ వర్కులను ఉపయోగించి అధునాతన కృత్రిమ మేధస్సు నమూనాలను అభివృద్ధి చేసినట్టు తెలియజేశారు.ఈ పరిశోధన, కృత్రిమ రెటీనా డేటాసెట్లను రూపొందించడానికి, వ్యాధి నిర్ధారణ కచ్చితత్వాన్ని మెరుగుపరచడానికి, వ్యాధి తీవ్రతను వర్గీకరించడానికి వినూత్నమైన ఏఐ-ఆధారిత ఫ్రేమ్ వర్కులను పరిచయం చేసినట్టు వివరించారు. ప్రతిపాదిత ఈ వ్యవస్థ, ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో, నేత్ర వైద్యులకు ముందస్తు రోగ నిర్ధారణలో సహాయపడటానికి, రోగ నిర్ధారణ పనిభారాన్ని తగ్గించడానికి, పెద్దయెత్తున మధుమేహ నేత్ర పరీక్షలను సులభతరం చేయడానికి దోహదపడే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు.డాక్టర్ కార్తీక సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్.మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం

**- ప్రజావాణిలో 55 దరఖాస్తుల స్వీకరణ**

**- సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్**



**మెదక్,ఆగస్టు,24,మెదక్ టుడే న్యూస్:** ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని డీఆర్ఓ, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను పూర్తిస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ప్రతి వినతిపై ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా స్పందించి, నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 55 దరఖాస్తులను డీఆర్ఓ, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ స్వీకరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

**- మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు పకడ్బందీగా నోటీసులు జారీ చేయాలి**

**- జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్**





**మెదక్, ఆగస్టు 24, మెదక్ టుడే న్యూస్:**

ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేస్తున్నామని తెలిపారు.ఆగస్టు 27న నిర్వహిం చనున్న గ్రామ సభలు, వార్డు సభలను పకడ్బం దీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నావ ని వివరించారు. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకా లకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తామని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గఫార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# డబ్బుల గొడవ.. పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**- నర్సింగరావుపల్లి తండాలో విషాదం**



**పాపన్నపేట,ఆగస్టు,24, మెదక్ టుడే న్యూస్:** మండల పరిధిలోని నర్సింగరావుపల్లి తండాలో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగరావుపల్లి తండాకు చెందిన కేతావత్ తౌర్యా (32) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఖర్చుల కోసం డబ్బులు ఇవ్వాలని తరచూ తల్లి, భార్యతో గొడవ పడుతుండేవాడని పోలీసులు తెలిపారు. ఇదే క్రమంలో ఈ నెల 22వ తేదీ రాత్రి డబ్బుల విషయంలో తల్లి, భార్యతో మరోసారి గొడవ పడ్డాడు. మరుసటి రోజు ఉదయం తల్లి హేమ్లీ తన కూతురు ఇంటికి వెళ్లగా, భార్య సునీత కూలీ పనులకు వెళ్లింది.ఈ క్రమంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన తౌర్యా, పాపన్నపేట గ్రామ శివారులోని చెరువు కట్టపై గుర్తుతెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.అయితే చికిత్స పొందుతూ ఆదివారం తౌర్యా మృతి చెందాడు. మృతుడి తల్లి హేమ్లీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# మెదక్ వైద్య సేవలకు మరింత బలం

**- త్వరలో క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం..**

**- ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆకస్మిక తనిఖీ, సమీక్ష**



**మెదక్,ఆగస్టు,24,మెదక్ టుడే న్యూస్:** మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుతో కలిసి మంత్రి ఆకస్మికంగా పరిశీలించారు.అనంతరం క్రిటికల్ కేర్ బ్లాక్‌ను త్వరలో ప్రారంభించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జీజీహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీతాదేవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నితిన్ కబ్రా, డీఎంహెచ్ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాళ్‌తో పాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభానికి అవసరమైన మానవ వనరులు, వైద్య పరికరాలు, మౌలిక వసతులు, ఐహెచ్ఎఫ్ఎంఎస్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంపై మంత్రి ప్రత్యేకంగా చర్చించారు. ఈ అంశాలపై ఆగస్టు 25న హైదరాబాద్ సచివాలయంలో నిర్వహించే ఉన్నతస్థాయి సమావేశానికి హాజరుకావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవల బలోపేతం, జీజీహెచ్ నూతన భవన నిర్మాణం, మెడికల్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ నిర్మాణం తదితర అంశాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు.తూప్రాన్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. అలాగే నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ ప్రాంతాల్లో కిడ్నీ రోగులకు అందిస్తున్న డయాలసిస్ సేవలపై కూడా చర్చించారు.మెదక్ జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు అందేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావుతో పాటు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# గాజులపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ: సర్పంచ్ పంజా స్వామి.



**దౌల్తాబాద్ ఆగష్టు 24**
దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పంజా స్వామి ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వామి మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందనున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు,జీపీ ఓ రమేష్, రేషన్ డీలర్ శ్రీకాంత్, వార్డు సభ్యులు డి. సత్యం, ఎం. స్వామి, బి. బ్రహ్మానందరెడ్డి, ఎం. కనకయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్‌లో ఎంజేపీ దౌల్తాబాద్ ప్రభంజనం.

**- 9 పతకాలు కైవసం.. సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు ఎంపిక.**




**దౌల్తాబాద్ ఆగష్టు 240** సిద్దిపేట జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఎంజేపీ దౌల్తాబాద్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ప్రతిభ కనబరిచి ఏకంగా తొమ్మిది పతకాలను కైవసం చేసుకుని కళాశాలకు ఘనకీర్తి తీసుకొచ్చారు. ఇందులో నాలుగు స్వర్ణ, మూడు రజత, రెండు కాంస్య పతకాలు ఉన్నాయి.ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులు ప్రవీణ్, దేవిదాస్, విష్ణు, రాఘవేంద్రలు సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 26, 27 తేదీల్లో హన్మకొండలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొననున్నా రు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి కళాశాల పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్ సాయికృష్ణ, పీఈటీలు బస్వరాజ్, డాంబులను కూడా ఆమె అభినందించారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక.

**- ప్రజావాణికి రెండు దరఖాస్తులు.**

**- భూ సమస్య, పెన్షన్ మంజూరుపై వినతులు.**

**దౌల్తాబాద్ ఆగష్టు 24**
దౌల్తాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రజా పరిషత్ అధికారి అబ్జాలోద్దీన్ తెలిపారు. ఒక దరఖాస్తు భూ సమస్య పరిష్కారం కోసం, మరో దరఖాస్తు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అందినట్లు పేర్కొన్నారు.ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, పీఆర్ఏఈ రాంకుమార్, ఎంపీవో గఫూర్ కాద్రి తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారంలో ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**జిన్నారం, ఆగస్టు 24:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారం డివిజన్ పరిధిలోని బీసీ కాలనీలో సోమవారం సాయంత్రం నిర్వహించిన శ్రీ అమ్మవారి ఫలహారం బండి ఊరేగింపు మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన ఇలాంటి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంచడంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. పటాన్ చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని, కాలనీలు, బస్తీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ అధికారుల సంఘానికి నూతన కార్యవర్గం

**- ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు**

**- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్**





**మెదక్,ఆగస్టు,24,మెదక్ టుడే న్యూస్:**
మెదక్ జిల్లా పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగాయి. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.ఎన్నికల నోడల్ అధికారి అదనపు ఎస్పీ, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, రామకృష్ణ పర్యవేక్షణలో ఎన్నికలు సజావుగా కొనసాగాయి. ఎన్నికల ఏర్పాట్లను ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలోని వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా అభిలాష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఆర్ఎస్ఐ నరేష్ కార్యదర్శిగా, విజయ్ కోశాధికారిగా, రాము సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సంఘంలో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా సాజిద్ అలీ, సతీష్, విజయ్ కుమార్, గంగామణి, నర్సింలు, రేణుక ఎన్నికయ్యారు. గోపాల్, భాగ్యలక్ష్మి కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. పోలీస్ అధికారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

# చట్టబద్ధంగా, పారదర్శకంగా ఫిర్యాదుల పరిష్కారం

**- ప్రజా ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ**

**- ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలి**

**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్**



**మెదక్,ఆగస్టు,24,మెదక్ టుడే న్యూస్:**
ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి వినతిదారుడి సమస్యను బాధ్యతగా పరిగణించి, ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలని అధికారులకు సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.

# అక్రమ నిర్మాణాల కట్టడిలో
# ముగ్గురు కమిషనర్లు విఫలం

- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ.. చర్యలు మాత్రం శూన్యం
- జోనల్ కమిషనర్ల మౌనమే అక్రమ నిర్మాణాలకు అండగా మారిందా.?
- అధికారుల నిర్లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు
- అంజయ్య నగర్ సంఘటనతో ఇకనైనా కమిషనర్లు కఠిన చర్యలు తీసుకునేనా.?
- కార్మికుల ప్రాణాలు పోతున్న, ప్రభుత్వ ఆదాయం భారీగా గండి కొడుతున్న అధికారులలో చలనం లేకపాయే.?










**హైదరాబాద్,ఆగస్టు,24, మెదక్ టుడే న్యూస్:**
గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు రోజురోజుకూ పెరుగుతున్నా వాటిని కట్టడి చేయాల్సిన ఉన్నత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజావాణిలో ప్రజలు ఎన్నో ఫిర్యాదులు చేస్తున్నా వాటిపై కఠిన చర్యలు ఎక్కడ కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ముగ్గురు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, జోనల్ సిపి స్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా ఫలితం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**సాధారణ, ప్రజావాణి ఫిర్యాదులు బుట్టదాఖలా.?**
ప్రజావాణిలో అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.? వాటిలో ఎన్ని పరిశీలించారు.? ఎన్ని నిర్మాణాలపై నోటీసులు ఇచ్చారు.? నోటీసులు ఇచ్చిన తర్వాత నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయి.? సీజ్ చేసిన భవనాలు ఎన్ని.? సీజ్ చేసిన తర్వాత ఎన్ని నిర్మాణం పూర్తి చేసుకొని వినియోగంలో ఉన్నాయి.? ఎన్ని కూల్చివేశారు.? ఎన్ని కేసులు నమోదు చేశారు.? ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించకుండా పెండింగ్‌లో ఉన్నాయి.? అనే వివరాలను కమిషనర్లు బహిర్గతం చేయగలరా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వాటిని బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. ఒక్క ఫిర్యాదుపై అయిన పూర్తి స్థాయిలో చర్య తీసుకున్నారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఉన్నత అధికారుల మౌనం ఎందుకు.?**
చైన్‌మెన్ నుంచి న్యాక్ ఇంజనీర్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపీ, డిప్యూటీ కమిషనర్, జోనల్ ఏసీపీ, జోనల్ కమిషనర్ స్థాయి వరకు పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు ఎలా పుట్టుకొస్తున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. కొందరు అధికారులు లంచాల తీసుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఇబ్బంది, అధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయించి వాళ్లపైకఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన ఏది.?**
అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమైనా ముగ్గురు కమిషనర్లు, సంబంధిత జోనల్ కమిషనర్లు, జోనల్ సీపీలు, డిప్యూటీ కమిషనర్లు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు, జర్నలిస్టులు అక్రమాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారినే ఇబ్బందులకు గురి చేయడం, అక్రమ నిర్మాణదారులతో చెప్పి తప్పుడు కేసులు పెట్టడం వంటి అనేక ఆరోపణలు కూడా అధికారులపై వినిపిస్తున్నాయి.

అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే వారిని కాకుండా అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**సంఘటన జరిగినప్పుడే హడావుడినా.?**
ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, కోర్టు ఆదేశాలు వచ్చినప్పుడు లేదా ముఖ్యమంత్రి సీరియస్ అయినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా ప్రకటనలు చేయడం, తనిఖీలు నిర్వహించడం, పేరుకు నాలుగైదు అక్రమ నిర్మాణాలు కూల్చివేయడం అంతే, తరువాత వారం రోజులకే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారుతోందన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత కమిషనర్లు స్పందించడం కాదు. ప్రమాదాలకు కారణమయ్యే అక్రమ నిర్మాణాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

**విజిలెన్స్ నివేదికలపై చర్యలేవి.?**
అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు ఇచ్చిన నివేదికలు ఏమయ్యాయి.? వాటిపై తీసుకున్న చర్యలేంటి.? బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారా.? అన్నది కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అవినీతి అధికారులపై నివేదికలు తయారవుతున్నా చర్యలు లేకపోతే అవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయన్న అనుమానాలకు బలం చేకూరుతుంది. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం ఉండి కూడా ఇంత అవినీతి జరుగుతుంది అంటే మరి విజిలెన్స్ విభాగం ఉంది ఏం ఉపయోగమో ప్రభుత్వానికే తెలియాలి.

**కోర్టు స్టే లపై ఎందుకీ నిర్లక్ష్యం.?**
కోర్టు కేసులు, స్టే ఆర్డర్లు ఉన్న నిర్మాణాల విషయంలో డిప్యూటీ, జోనల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులు నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్నారా.? స్టే తొలగింపునకు కౌంటర్లు వేస్తున్నారా.? వేయకుంటే ఎందుకు వేయడం లేదు.? లేక వాటిని పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగుతున్నా మౌనం వహిస్తున్నారా.? అన్నది తేలాల్సి ఉంది.
గ్రేటర్ హైదరాబాద్‌లో మూడు కమిషనర్ కార్యాలయాల పరిధిలో అధికారులు ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్నారా.? లేక అక్రమాలకు అండగా నిలుస్తున్నారా.? అన్నది కమిషనర్లే తేల్చాలి. అక్రమ నిర్మాణాలపై వచ్చిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా సమీక్షించి, పెండింగ్ ఫిర్యాదులపై గడువుతో కూడిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ఉన్నత అధికారులు మౌనం వహిస్తే.. ఆ మౌనం వెనుక కారణమేంటో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది.

# గుండెపోటుతో పెద్ద రామ్ చర్ల గ్రామ సర్పంచ్ మృతి...!

- పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు...!!



**జనగామ, ఆగస్టు 24**
జనగామ జిల్లా జనగామ మండలం పెద్ద రాంచర్ల సర్పంచ్ వల్లాల మల్లేశం గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.విషయం తెలుసుకున్న యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు సభ్యులు... డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# బచ్చన్నపేటలో కర్రె సత్తన్న తల్లి మృతి...!

**దశ దినకర్మలో పలువురు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జోహార్లు అర్పించారు...!!**




**జనగామ/ బచ్చన్నపేట, ఆగస్టు 24 (**
ప్రజాతంత్ర విద్యార్థి సంస్థ (ఋూ) పూర్వ నాయకులు, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర కో-ఆర్డినేటర్ కర్రే సత్తన్న తల్లి కర్రే యల్లమ్మ ఇటీవల మరణించారు. ఈరోజు జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రం లో యల్లమ్మ దశ దిన కర్మ సందర్భంగా ఋూ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, ఋూ పూర్వ నాయకులు, జూ×(మీూ) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ గడ్డం సదానందం, ఋూ మాజీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల శ్రీనివాస్ రావు, ఋూ మాజీ రాష్ట్ర కార్యదర్శి శీలం స్వామి గార్లు హాజరై యల్లమ్మ చిత్ర పటం వద్ద పుష్పంజలి ఘటించి జోహార్లు అర్పించారు.

# గచ్చిబౌలి, రాయదుర్గం ట్రాఫిక్‌పై ఉన్నతాధికారుల పరిశీలన

**ట్రాఫిక్ రద్దీ నివారణకు కీలక చర్యలు -- జంక్షన్ల పరిశీలన**





**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో ఆగస్టు 24**
గచ్చిబౌలి, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరిచేందుకు సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్, ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్ ఖాన్, ఏసీపీ టి. హన్మంత్ రావు కీలక ప్రాంతాలను పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ, వాహనాల సాఫీ రాకపోకలు, రహదారుల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.జర్నలిస్ట్ కాలనీ కమ్ వద్ద యూటర్న్ ఏర్పాటు, అపర్ణ శాంగ్రీలా--గౌలిదొడ్డి మార్గంలో రహదారి విస్తరణ, మరమ్మతులు, విప్రో జంక్షన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు, రహదారిపై పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించడం, ఫ్రీ లెఫ్ట్‌లను విస్తరించడం వంటి చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.గౌలిదొడ్డి--నానక్‌రామ్‌గూడ--ఐఐఐటీ--ఐసీఐసీఐ మార్గంలో ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలను పరిశీలించారు. ట్రాఫిక్‌ను విభజించడం, అవసరం లేని యూటర్న్‌లను తగ్గించడం, వాహనాల రాకపోకలకు నిరంతరాయంగా మార్గం కల్పించడం వంటి అంశాలపై దృష్టి సారించారు. వంశీరామ్ బీఎస్ఆర్ టవర్స్ నుంచి మెడికుంట అంచు మీదుగా మంత్రి కన్‌స్ట్రక్షన్స్ రోడ్‌కు ప్రత్యామ్నాయ రహదారి అభివృద్ధి చేసే అంశాన్ని కూడా పరిశీలించారు. ఐటీసీ కోహినూర్ వద్ద జరుగుతున్న పనులను తనిఖీ చేసిన అధికారులు.. పనులను వేగవంతం చేసి ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని టీజీఐఐసీ అధికారులకు సూచించారు. పాద చారులు రోడ్డు దాటేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని వినియోగించేలా తగిన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.శాస్త్రీయ విధానంలో ట్రాఫిక్ నిర్వహణ, ఫ్రీ లెఫ్ట్‌ల సమర్థ వినియోగం, రహదారి మౌలిక వసతుల మెరుగుదల, పాదచారుల భద్రతతో పాటు గచ్చిబౌలి--ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్--నానక్‌రామ్‌గూడ కారిడార్‌లో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

# ప్రభుత్వ భూములను పరిరక్షించాలని గ్రీవెన్స్ లో ఫిర్యాదు




**తుర్కపల్లి, ఆగస్టు 24**
తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ తహసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డికి అడ్వకేట్ పడాల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సదరు విలువైన భూములను ఆక్రమించవద్దని కోరుతూ గతంలోనే తహసిల్దార్ కార్యాలయం పక్కన ఉన్న బీసీ కమ్యూనిటీ హాల్ యొక్క దాదాపు బేస్మెంట్ స్థాయి నిర్మాణాన్ని కోర్టు ఉత్తర్వుల ద్వారా కూల్చివేయడం జరిగిందని అన్నారు .మాజీ ఎమ్మెల్యే సునీత మహేందర్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు డబల్ బెడ్ రూమ్ లు ఉన్న ప్రాంగణంలో బీసీ కమ్యూనిటీ హాల్ కోసం శంకుస్థాపన చేశారని అన్నారు. దురదృష్టవశాత్తు ఆమె ఓడిపోయారని, ప్రభుత్వం కూడా మారిందని, తమ విన్నపాన్ని సంబంధిత అధికారులు ఏదైనా కమ్యూనిటీకి కేటాయిస్తే మున్నూరు కాపు కమ్యూనిటీ కూడా బీసీ కమ్యూనిటీ హాల్ కు అర్హులేనని అన్నారు. మండల కేంద్రంలో అక్రమ కట్టడాలకు తహసిల్దార్, ఎంపీడీవో అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను కాపాడాలని అన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..